క్లుప్తంగా

తాగునీటి బోరుకు మరమ్మతులు


బోరుకు మరమ్మతులు

విజయపురం: మండలంలోని విజయపురం దళితవాడలో తాగునీటి విద్యుత్ మోటార్‌కు సర్పంచ్ జబమేరీ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. మరమ్మతులకు గురైన పైపులను తొలగించి నూతన పైపులు ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా తాగునీరు అందకపోవడంతో అదనపు పైపు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైందని ఆమె పేర్కొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా


కుక్క అడ్డు రావడంతో బోల్తా పడ్డ కారు

గంగాధరనెల్లూరు: చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఓ కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి బోల్తా పడ్డ సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం హోసూరు నుండి పుత్తూరుకు వెళుతున్న రమేష్ కుటుంబ సభ్యుల కారుకు ఎట్టేరి వద్ద ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దీంతో కారు అదుపుతప్పి బోల్తా పడి పక్కన ఉన్న ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులకు చిన్నచిన్న గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారు చికిత్స పొందుతున్నారు.

వేతనాలు పెంచాలి


తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

పాలసముద్రం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. శుక్రవారం ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పాలసముద్రం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇతర వైద్య సిబ్బందికి వర్తించే విధంగా వేతనాలతో కూడిన నెలవు దినాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారం వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని చెప్పి అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడం బాధాకరమన్నారు. అనంతరం తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందించారు.

మహిళలకు వైద్యసేవలు


పోషకాహారంపై మాట్లాడుతున్న సీడీపీఓ


నగరి: మండలంలోని తడుకుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వైద్యాధికారులు, వైద్య నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ ఒక ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉన్నట్లే అన్నారు. స్వస్థనారీ సశక్తి పరివార్ ఉద్దేశాలను, వైద్య పరీక్షలను వివరించారు. మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ శిబిరంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రెండో విడత కౌన్సెలింగ్


వెదురుకుప్పం- డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో భాగంగా శుక్రవారం నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ నెల 29 చివరి తేదీ అన్నారు. ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు డిగ్రీలో చేరదలచినవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జతలు జిరాక్స్ కాపీలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 98851 25771, 77029 17803, 97044 25888 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాల్యానికి లేదు.. భరోసా



- గ్రామ సచివాలయాల్లో కనిపించని వివాహ నమోదు
- అధికారులు, ప్రజల్లో కొరవడిన అవగాహన
- చట్టం అమలైతేనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

ఆదేశాలు జారీ చేశాం



అన్ని గ్రామాల్లో వివాహాల నమోదు తప్పనిసరి చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. వివాహం చేసుకునే గ్రామాల్లోనే నమోదు చేసుకోవచ్చు. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రజలకు, ప్రజా ప్రతినిధులు సహకరించాలి.

– చంద్రమౌళి, ఎంపీడీఓ, కార్వేటినగరం

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి



బాల్య వివాహాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కాలేజీలు, తల్లిదండ్రులకు ఇలా ప్రతి ఒక్కరికి బాల్య వివాహాలపై అవగాహన తప్పనిసరి. గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తి అయిన మరుసటి ఏడాదే బాల్య వివాహాలు చేస్తున్నారు. వివాహాలు చేసే ప్రతి ఒక్కరూ పంచాయతీల్లో నమోదు చేయాలని విధిగా పెడితే చాలా వరకు అరికట్టవచ్చు.

– వాడ గంగరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, చిత్తూరు

కార్వేటినగరం: వివాహ నమోదు తప్పనిసరి చేయాలని 2002లో చట్టం చేశారు. జీఓ నెంబర్ 193 ప్రకారం ప్రతి గ్రామంలో వివాహాల నమోదును గ్రామ కార్యదర్శులు చేయాలని చట్టాన్ని రూపొందించారు. వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మతాల ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉన్నాయి. 2012లో కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో అన్ని మతాల వారికి రిజిస్ట్రేషన్ చట్టం వర్తించేలా రూపొందించారు. అయితే వివాహాల రిజిస్ట్రేషన్ నమోదుపై నేటికీ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించడం లేదు. పలువురు కార్యదర్శులకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై తప్ప, వివాహాల నమోదుపై అవగాహన లేదు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు వయస్సు తప్పనిసరి అనే విషయం గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. ఇప్పుడు ప్రతి దానికి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసినా ఆ వైపు అడుగులు పడడం లేదు. తీరా ఏదైనా సమస్య వచ్చినప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సచివాలయాల్లోనే నమోదు

గతంలో గ్రామ పంచాయతీల్లో నమోదు ఉండగా ఇప్పుడు గ్రామ పంచాయతీలకు సచివాలయాలు రావడంతో వివాహం జరిగిన గ్రామ సచివాలయంలోని గ్రామ కార్యదర్శికి ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఏ విధంగా అయితే జారీ చేస్తారో వివాహ నమోదు ధ్రువీకరణ పత్రం కూడా అలాగే అందజేస్తారు. వివాహం జరిగిన 30 రోజుల్లోపు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 30 రోజుల తర్వాత కూడా రోజుకు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పెరిగిన బాల్యవివాహాలు గ్రామాల్లో ఆర్థిక సమస్యలు, అవగాహన లేమితో గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ప్రజల్లో పూర్తిగా చైతన్యం కొరవడింది. ఎంతో భవిష్యత్ ఉన్న జీవితాలు బాల్యవివాహాలతో చీకటిమయమవుతున్నాయి. నియోజకవర్గంలో ప్రతి ఏడాది బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని అడ్డుకునేందుకు గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు జంకుతున్నారు. చాలా గ్రామాల్లో బాల్య వివాహాలకు సంబంధించి పోలీస్ స్టేషన్ వరకు వచ్చినా వారి దగ్గర నిబంధనల ప్రకారం నడుచుకుని తర్వాత ఏకంగా వివాహాలే చేస్తున్నారు. దీంతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడడం లేదు.

ఏఈఓల బాధ్యతల స్వీకరణ


వందన, సురేష్

పెనుమూరు(కార్వేటినగరం): మండల వ్యవసాయ విస్తరణ అధికారులుగా ఇద్దరు శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు వ్యవసాయ అధికారి సువర్ణలత తెలిపారు. ఆమె మాట్లాడుతూ తవణంపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన ఎస్.వందన కలవకుంట ఏఈఓగా బాధ్యతలు చేపట్టారని, అలాగే చిత్తూరు నుంచి బదిలీపై వచ్చిన సురేష్ పెనుమూరు వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓగా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు.

విద్యార్థిపై సీనియర్ల దాడి

నారాయణవనం: ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్ గదిలో ఆరుగురు సీనియర్లు తనపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టి హింసించారని ఓ విద్యార్థి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ విద్యార్థి స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతూ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. అదే కళాశాలకు చెందిన ఓ విద్యార్థినికి మేసేజ్‌లు చేస్తున్నాడని ఆరుగురు సీనియర్ విద్యార్థులు 20వ తేదీ శనివారం రాత్రి తమ గదికి రప్పించి చితకబాదారు. జరిగిన సంఘటనకు విచారిస్తున్నామని చెప్పడానికి మరుసటి రోజు మరోసారి గదికి పిలిపించి దాడిచేశారు. ఈ సంఘటనను విద్యార్థి తల్లికి చెప్పడంతో అతనికి చికిత్స చేయించి, గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దాడికి పాల్పడిన ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న మెప్మా పీడీ ఎబ్రాయిం

పుత్తూరు: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లోక్ కల్యాణ్ మేళా కార్యక్రమం ద్వారా పొందుతున్న రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ జె.ఎబ్రాయిం కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎబ్రాయిం మాట్లాడుతూ పీఎం స్వనిధి 2.0లో భాగంగా తొలి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు వంతున రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పుత్తూరులో మొత్తం 1474 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందివ్వడానికి తగిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ మంజునాథ్‌గౌడ్, బ్యాంకు మేనేజర్లు, వైద్య సిబ్బంది, మెప్మా టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ సునీత, ఆర్గనైజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నగరి: మున్సిపల్ పరిధిలోని ఒక నివాసం వద్ద చిన్నచిన్న మూటలు కట్టి ఉంచిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం స్థానికంగా అందిన సమాచారం మేరకు సంబంధిత ప్రాంతానికి చేరుకున్న వారు అక్కడ నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఎవరిదన్న వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ విజయ్ నాయక్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని గోదాముకు తరలిస్తున్నట్టు డీటీ మేఘవర్ణం తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ హేమలత

పాలసముద్రం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం విరామంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో అలాంటి సమయంలో మొక్కలు నాటడం మంచిదన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు పచ్చదనం అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు.

జీవితానికి రక్షణ కవచం బీమా


రామకృష్ణను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: ఇన్సూరెన్స్ (బీమా) కుటుంబానికి, ఆస్తికి, వ్యాపారానికి రక్షణ కవచమని స్థానిక ఎల్ఐసీ అధికారి ఎస్.రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్సూరెన్స్‌లో ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ తమ వద్ద ఉన్న మిగులు ధనాన్ని ఎల్ఐసీలో పొదుపు చేయడం మంచిదన్నారు. కష్ట కాలంలో ఇన్సూరెన్స్ సొమ్ము కచ్చితంగా ఆదుకొంటుందని స్పష్టం చేశారు. నిరుద్యోగులు, విద్యార్థులు ఇన్సూరెన్స్ రంగంలో పూర్తి స్థాయిలో లేదా పార్ట్ టైమ్‌గా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. అనంతరం రామకృష్ణను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి, కామర్స్ విభాగం అధిపతి దేవకి, అధ్యాపకులు తిరుమలయ్య, వాసవి, గంగయ్య, జ్యోతి, నాగరాజు, లక్ష్మీబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిపై దృష్టి సారించండి


సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ

విజయపురం: గ్రామీణాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ రాజేంద్ర తెలిపారు. మండల కార్యాలయంలో శుక్రవారం గ్రామీణాభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పంచాయతీ నిధులతో ఆయా గ్రామాలకు అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ప్రధానంగా గ్రీన్ అంబాసిడర్లతో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి, డంపింగ్ యార్డుకి తరలించాలన్నారు. ఎక్కడైన తాగునీటి పైపులైన్ లీకేజ్ ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. మరమ్మతులకు గురైన వీధిదీపాలను తొలగించి నూతన లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

మాంబేడు వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

వెదురుకుప్పం: విధుల్లో నిర్లక్ష్యం, సమస్యల పరిష్కారంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఓ వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి.వెంకటసుబ్రమణ్యం గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించకపోవడంతో గతంలో స్థానికుల నుంచి అధికారులకు అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పందించిన నగరి ఏఎస్‌డబ్ల్యూఓ, వెదురుకుప్పం ఎంపీడీఓ సచివాలయంలో విచారణ చేపట్టారు. అధికారుల చేపట్టిన విచారణలో వెంకటసుబ్రమణ్యం సకాలంలో విధులకు హాజరు కావడం లేదని, కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గుర్తించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారితో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో గతంలో అధికారులు హెచ్చరించినా వారి ఆదేశాలను భేఖాతరు చేయడంతోపాటు తీరుమారలేదు. ఈ క్రమంలో గత నెలలో నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకట సుబ్రమణ్యంను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగమణి శుక్రవారం తెలిపారు.

కల్పవల్లీ.. జయములివ్వు



కరకంఠేశ్వర ఆలయంలో కుంకుమ పూజలు, కలువపూలతో మాజీ మంత్రి ఆర్కే రోజా పూజలు

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో నవరాత్రి పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అమ్మవారు వినూత్న రూపాలలో భక్తులకు దర్శనమిచ్చారు. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కరకంఠేశ్వరాలయంలో దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి కౌమారి అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణేశ్వరికి శ్రీస్కందమాత అలంకారం చేశారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో వేపాకులు, పూలదండలతో అలంకరించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. గ్రామదేవత సామాలమ్మ ఆలయం వద్ద వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి నవరాత్రి పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాజుల మాలతో అలంకరించి పూజలు చేశారు.

మాజీ మంత్రి ఆర్కే రోజా నవరాత్రి పూజలు

మాజీ మంత్రి ఆర్కే రోజా నవరాత్రి పూజల్లో భాగంగా స్వగృహంలో కలశపూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కలువ పూలతో పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరు ణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో శుక్రవారం శ్రీరాజరాజేశ్వరి దేవి మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి భక్తిప్రపత్తులతో పాలు, పెరుగు, నారకేళ జలాలతో అభిషేకించారు. సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.

అమ్మవారికి ధనలక్ష్మి అలంకారం

నింద్ర: మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీనవరాత్రులను పురస్కరించుకుని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన నింద్రలోని వినాయక ఆలయంలో దేవీనవరాత్రి పూజల్లో భాగంగా అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. కేఆర్ పాళెం గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేశారు.

మీనాక్షి దేవిగా అల్లియల్లమ్మ

గంగాధరనెల్లూరు: శ్రీఅల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం మీనాక్షి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ అమ్మవారి మూల, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా వెజ్జుపల్లి పెద్దబ్బరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఎగవూరుకు చెందిన సుబ్బారెడ్డి తనయులు, రాజారెడ్డి, లక్ష్మణ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గోవింద భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు


భజనలు చేస్తున్న గోవింద భక్తులు

నగరి: ఓంశక్తి ఆలయం వద్ద తమిళనాడు ఓచ్చేరి నుంచి విచ్చేసిన సుమారు 750 మంది గోవింద భక్తులకు పట్టణ పరిధిలోని పలువురు దాతలు శుక్రవారం అన్నదానం చేశారు. దీంతో ఓంశక్తి ఆలయ ఆవరణతోపాటు రహదారి కూడా గోవింద భక్తులతో నిండింది. ఆలయంలో గోవింద భజనలు మిన్నంటాయి. భజన అనంతరం ఆలయంలోని గోవింద భక్తులతో పాటు, పాదచారులకు కూడా అన్నదానం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. పద్దెనిమిదేళ్ల పాటుగా భారీ ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దాతలు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్న ఆలయ నిర్వాహకులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆరుముగం, పెరుమాళ్, సుబ్రమణ్యం, జయచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్,కుమార్, దయానిధి, చంద్రారెడ్డి, మునికృష్ణారెడ్డి, ఎల్లప్ప రెడ్డి, వేలు, రామ్‌మోహన్, కృపానిధి, అశోక్, రామూర్తి, పొన్నురంగం, దేవా, మురళీమోహన్, కాశి, జగన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

గంగాధరనెల్లూరు: చిరుధాన్యాలను ఆహారంలో ప్రతినిత్యం ఉపయోగిస్తే ప్రజలకు ఆరోగ్యమని, అదేవిధంగా చిరుధాన్యాల సాగుతో రైతులకు అధిక లాభమని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మునీంద్ర నాయుడు అన్నారు. మండలంలోని నెల్లేపల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శుక్రవారం ఒకరోజు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో ప్రస్తుత రైతులు అధిక లాభం సంపాదించవచ్చని, ప్రజలు చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. రైతులంతా చిరుధాన్యాల సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని, ప్రజలకు ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఏఓ భవాని, ఆత్మ అధికారి దేవేంద్ర, ఢిల్లీ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో విలీనం చేయాలి

- సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- విలీనం చేసేంత వరకు పోరాటం ఆగదు
- ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల్లో విలీనంపై గళం విప్పాలి


కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని నిరసన

కార్వేటినగరం: తిరుపతి పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్న కార్వేటినగరాన్ని అదే జిల్లాలో విలీనం చేయాలని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వామపక్ష నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్ నుంచి గాండ్లమిట్ట కూడలి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాండ్లమిట్ట కూడలి విలేకరుల సమావేశంలో ఎంపీపీ లత మాట్లాడారు. విద్య, వైద్యం, వాణిజ్య వ్యాపారాలకు, అనుకూలంగా ఉంటున్న తిరుపతి జిల్లాలో కార్వేటినగరాన్ని విలీనం చేసి, మండల ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేసి అత్యంత సమీపంలో ఉన్న పుత్తూరు పట్టణంలో విద్యాభ్యాసాలు కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సీఎం చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లు కార్వేటినగరం పర్యటనలో భాగంగా ప్రజల కోరిక మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేస్తారని హామీ ఇచ్చారని తెలిపారు. వారు ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జగన్నాథం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ కూడా ఇదే మండలానికి చెందిన వారని, ఆయన కూడా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పాలన్నారు. కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసేంత వరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. మండల ప్రజలు భారీ ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. అఖిలపక్ష నాయకులు బాలాజీ, ధనుంజయవర్మ, పట్నం ప్రభాకర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, లోకనాథనాయుడు, ధనశేఖర్‌వర్మ, శివప్రకాష్ మొదలి, గోపి, పురుషోత్తంరెడ్డి(టీడీపీ), సుబ్రమణ్యంరాజు(టీడీపీ), నాగయ్య(టీడీపీ), గౌతం రాజు(కాంగ్రెస్), అంబిక, మోహనకుమారి, ముస్లిం మైనారిటీ నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తును కోల్పోతారు



ఉన్నత విద్య కోసం పుత్తూరు, తిరుపతి పట్టణాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రానున్న కాలంలో నాన్‌లోకల్ కింద ఉద్యోగ అవకాశాలను కోల్పోతారు. కార్వేటినగరానికి పుత్తూరు పట్టణం 12 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విద్య, వైద్యం కోసం వెళ్లాల్సిన అవసరం ఉంది. తిరుపతి జిల్లాలో విలీనం హామీని టీడీపీ నెరవేర్చాలి.

–బాలాజీ, వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్వేటినగరం

నేడు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం నిర్వహించనున్నట్లు శుక్రవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ విలేకరులకు తెలిపారు. జిల్లాలోని బధిరులు, సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. బధిర ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉందని, దీనిని ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలియజేసి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.